# కొమ్ములల్లేని ఎడ్లు

పొద్దు పడమటికి వంగింది. సూర్యుడు ఆకారంలో కొంత పెద్దగానూ రంగులో ఒకింత ఎర్రగాను కనిపిస్తున్నాడు. పనిపాటల కోసం ఆడవికి వెళ్ళిన జనం ఊరు చేరడానికి ఇంకా కొంత సమయం ఉంది. ఊరంతా కోడి తన పిల్లలపై రెక్కలు కప్పి కునుకు తీస్తున్నట్లుంది. పెద్దపిల్లలు చంటి పిల్లలను సమాధానపరచటానికి ఒక్కొక్కరు ఒక్కొక్క తీరు పాట్లు పటుతున్నారు. అక్కడక్కడ మంచాల మీద ముసలి వాళ్ళు దగ్గుతూ గునుస్తూ ఉన్నారు. అది ఓ పల్లెటూరు. ఉన్నట్టుండి దళితవాడలో కుక్కలు బెదిరి చూస్తున్నాయి. పందులు పరుగులు తీస్తున్నాయి. పైన గద్దలు కిందికే చూస్తున్నాయి. ఊరమ్మటె వున్న ఊర బావి దగ్గర రెపరెప కొట్టుకుంటున్న కోళ్ళు, కోడిపిల్లలు. ఆడుకుంటున్న పిల్లలు ఆటలు మానేసి గిలగిల కొట్టుకుంటున్న వాటినే చూస్తు న్నారు. ముసులివాళ్ళు వాటివైపే చూస్తు "ఛో.ఛో " అంటూ అంగలారుస్తున్నారు. బడినుండి వచ్చిన పిల్లలు వాళ్ళ వాళ్ళ కోళ్ళను చేతుల్లోకి తీసుకొని ఏమైంది అని అదుర్దాగా చూస్తున్నారు. పొద్దు దగ్గరపడింది. పొలం నుండి జనం ఊరు చేరుతున్నారు. దళితవాడంతా గందరగోళంగా వుంది. ఇళ్ళముందు వాకిళ్ళలో చెట్లకింద రాలిపడిన పువ్వుల్లా నిర్జీవంగా కోళ్ళు, కోడి పిల్లలు. దళితవాడ పక్కమ్మటె ఊరబావి ఎనుగు పొడుగూత చచ్చిపడివున్న కోళ్ళే. ఎందుకిట్లా ఒక్కసారె కోళ్ళన్నీ చచ్చిపడివున్నాయి.

పొద్దుకూకింది. అందరూ ఊరు చేరుతున్నారు. దళివాడలో కలవరం మొదలైంది. ఎదను బాదుకుంటున్న ఆడవాళ్ళు. పండగ పబ్బాల కోసం సాదుకున్న కోళ్ళు పండగలు రాకముందే ఈ గోరం జరిగింది. అంటూ ఏడుపులు పెడబొబ్బలు, తిట్లు శాపనార్థాలతో దళితవాడంతా గందరగోళంగా వుంది. ఊళ్ళో కోళ్ళను అందరూ పెంచుతారు కానీ అవి దళితులకు మాత్రం ఓ చిన్నపాటి ఆస్తులు. వాటి మీద వచ్చే రాబడితో బట్టలు కొనుక్కుంటారు.గాజులు, మట్టెలు పెట్టించుకుంటారు. రకరకాల చిల్లర ఖర్చులన్నిటినీ ఈ కోళ్ళమీద వచ్చే పైకంతో తీర్చుతారు. అందరూ అనుకోని ఈ సంఘటనకు అవాక్కై కారణం గూర్చి ఆలోచిస్తూ కారణం ఎవ్వరై ఉంటారా అని ఆరా తీస్తున్నారు.

* * *

ఆ ఊరి దళితులకు మూడెకరాల బంజరు భూమి ఐదేండ్ల క్రితం పట్టా అయింది. పంచుకుంటే తలా మూడు కుంటలు కూడ రాదని అందరు కలసి ఉమ్మడిగా దున్నుతూ

కందులు, పెసలు వేసుకుంటూ వస్తున్నారు. అందరి ఇంటి ముందరి పెంట దిబ్బలను తెచ్చి అందులోనే చల్లారు కాబట్టి కంది చేను పసరు కక్కుతూ నాచు రంగులో నవనవలాడుతూ వుంది. దానికి ఇంటికొకరోజు చొప్పున కాపలా కాస్తునే ఉన్నారు. అయినా కాపలా వాని కళ్ళలో దుమ్ముకొట్టి ఏనుగు ఇరగతొక్కి చేలో జొరబడి తుమ్మకాయను తిన్నట్టు తింటున్నాయి పశువులు. అవతలి మూల నుండి కాపలా కాస్తున్న వ్యక్తి పరుగెత్తుకొచ్చేలోపల మునుం మందం మేయనే మేసినయి. అప్పుడే అటునుండి వెళుతున్న మరో ఇద్దరు దళితులు అది చూసి చేను దగ్గరికొచ్చి పశువులను కొట్టుకొచ్చి బాటలో మళ్లేసి కాపలాగ నిల్చున్నారు. కాపలావాన్ని కసిరించి, -

"పసులు చేలో పడ్డది కనిపిస్తలేదా ? " అన్నారు.

"ఈటన్నే నక్కలు తిన ఆ మూల నుండి వస్తనే వున్న పడిమేస్తనే వున్నాయి " అంటూ చేతులో వున్న కర్రతో వాటిని బాదసాగాడు. అవి దెబ్బలకు తట్టుకోలేక అటు, ఇటూ పరిగెడుతున్నాయి. ముగ్గురు మూడువైపులా నిల్చుని వాటిని అక్కడే మళ్ళేసారు. అవి చేసేది లేక బుసలు కొడుతూ బెదిరి బెదిరి చూస్తున్నాయి. ఈ హంగామాకు చెట్ల మీద పిట్టలు లేచి పక్కనే వున్న బోడు వైపు ఎగిరిపోతున్నాయి.

"ఇవి ఎవరి పసులు " అన్నాడు చింతకింది బుచ్చయ్య చేతిలో కర్ర, చెవిలో చుట్ట, బుజం మీద కండువా మోకాళ్ళవరకు గోచి. పాదాలకు పాత చెప్పులు.

"పెదరెడ్డివి " అన్నాడు చేను దగ్గర వున్న బర్ల లింగయ్య. అతని చేతిలో బుచ్చయ్యలాంటి వేషధారణ అదనంగా నడుం జవారు.

"అయితె వాటిని కొట్టొద్దు. కొడితె దెబ్బలు కనపడి తగాదాకు దారితీస్తాయి " అన్నాడు బుచ్చయ్య తన చేతి కర్రతో పసులను అదిలిస్తూ.

"మొన్న ఆడు మన కోళ్ళు వరి చేలోకి పోతే ఎండ్రిన్ కలిపిన గింజలు చల్లి చంపలే. మనం గూడ " చేతిలోని కర్రను మరొకసారి కొట్టటానికి లేపుతూ అన్నాడు లింగయ్య.

"చంపుదాము అంటవు. వాడు ఎండ్రిన్‌పెట్టి, ఎలుకల కోసం మందు పెడితే వాటిని కోళ్ళు తిని సచ్చినయి నేనేం చెయ్యను అని నలుగుట్ల అని తప్పిచ్చుకునే. మరి మనం ఎట్ల తప్పిచ్చుకుందాం ? వద్దు ఇరికిపోతం. అంతే కాదు కోసుకు తినడానికి ఈ పన్నాగం అంటరు. వద్దు వద్దు కొట్టొద్దు " అన్నాడు బుచ్చయ్య.

"అని వదిలిపెడదామా? " అన్నాడు ఎత్తిన కర్రను దించుతూ తన కోపాన్ని తానే దిగమింగుతూ.

"సెప్పితి గదా బందెల దొడ్లో పెడదామని అన్నాడు " భుజం మీద కండువాను ఎగేసుకుంటూ.

"జులుమాన కట్టి విడిపిచ్చుకొస్తడు. మనకేమొస్తది. " ఇద్దరిలోని మరుక వ్యక్తి కత్తి నర్సయ్య. జేబులోనుండి బీడి తీసి వెలిగించుకుంటూ.

"ఏం రాదు కానీ పెదరెడ్డి పశువులను బందెలదొడ్లో పెట్టి[ని ఊరంతా అనుకుంటరు మలుపు " అని పశువులను ఊర్వైపు మలిపారు. కానీ అవి వూర్వైపు అసలే మళ్ళటం లేదు. కారణం అవి ఊరు చేరే వేళ కాదు. అయినా ముగ్గురు మూడు వైపులా వుండి ఊరువైపు మళ్ళించారు. కొంత దూరం వెళ్ళినాక లింగయ్య తిరిగి చేను దగ్గరికి రాగా మిగతా ఇద్దరూ ఊళ్ళోకి తీసుకువెళ్ళారు.

విషయం ఊరంతా తెలిసింది. పెదరెడ్డి పశువులను దళితులు బందెలదొడ్లో

పెట్టారట. అని ఒకరికొకరు చెప్పుకుంటున్నారు. విషయం తెలియగానే దొర కళ్ళు ఎరుపెక్కాయి. పళ్ళు పటపట మన్నాయి. ఊళ్ళోని ఇతర కులాల వాళ్ళకు ఈ చర్య మింగుడుపడక ఒక్కొక్కరు ఒక్కొక్క విధంగా మాట్లాడుతున్నారు. దాని సారాంశం మాదిగలకు మస్తెక్కిందని. ఆ భూమి వాళ్ళ తాత తండ్రులు సంపాదించింది కాదని అది నిన్న మొన్నటి వరకు బంజరేకదా అని తమ అక్కసును కక్కుతున్నారు.

*　　　　*　　　　*

చీకటి పడింది. దొరోరి వాకిట్లో పళ్ళు కొరుకుతూ అటు ఇటూ తిరుగుతూ దళితవాడవైపు బస్మాసురినిలా చూస్తున్నాడు. లంకంత ఇల్లు. ఇంటికి పెద్ద నగిషీలు చెక్కిన తలుపులు. ఆ దర్జా రెండువైపులా రెండు అరుగులు. దర్వాజ ఎదురుగా ఎప్పుడు ఒక కుక్క పడుకొని ఉంటుంది. తన యజమాని అసహనాన్ని పసిగట్టినట్టుంది. అదీ ఓ మాదిరిగా గునుస్తూ వుంది. దళితులంతా ఒక్కటై మొన్న కోళ్ళను చంపిన సంగతిని గుర్తుచేసికుంటూ , నచ్చచెప్పుకుంటూ రాబోయే పరిస్థితిని అంచనా వేసికొంటున్నారు.

'కోళ్ళది ప్రాణం కాదు పశువులదే ప్రాణమా ? అయినా ఆయన చంపినట్టు సంపెయ్యలేదే. చేలో పడ్డయి ఇతరుల పశువులను బందెలదొడ్లో తోలినట్టు ఆయన పశువులను తోలినం. జరిమాన కట్టి విడిపించుకుంటే అయిపాయె. " అంటూ వాళ్ళకు తోచింది వాళ్ళు ఆలోచిస్తున్నారు. ఆడవాళ్ళు తమ తమ గుడిసెల్లో దీపాలు వెలిగించి వాకిట్లలో నిలుచున్నారు.

"దొరోరు జరిమాన కట్టాలనా " అంటూ వచ్చి నిలుచున్నాడు గ్రామ పంచాయితీ కారోబార్.

"ఊకె కొట్టుకొచ్చుకొమ్మను " అన్నారు వాకిట్లో కూడిన దళిత స్త్రీలు. ఇంకా వాళ్ళ కట్టు బొట్టు అంతగా మార్పు రాలేదని వాళ్ళ వేషధారణ చెపుతుంది. పిక్కల వరకు చీరెలు, ముదురు రంగు రవికెలు. కాళ్ళకు కంచు మట్టెలు- మట్టి గాజులు.

"అంతేనా" అన్నాడు కారోబార్.

"అంతే కదా" అన్నారు కొంత తీవ్రతను ప్రకటిస్తూ.

"ఆ తరువాత ఏం జరుగుతుందో తెలిసే అంటున్నరా" అన్నాడు. జేబులోనుండి బీడీ తీసి వెలిగంచుకొని మండుతున్న పుల్లను పక్కకు పడేశాడు. అది ఎండిన కసువు మీద పడి అంటుకుంది. ఆ మంటను చూసి అక్కడే తిరుగాడే ఓ పిల్లి పక్కకు పారిపోయింది.

"మొన్న కోళ్ళకు విషం పెట్టి సంపిస్తే ఇంతమందిమి ఉండి ఏం చేసినం అన్నది ఓ నడీడు స్త్రీ తన కొప్పును విప్పుకుంటూ.

"ఆ మీరు, దొరోరు ఒకటేనా? ఊరి సర్పంచ్ అసుంటిది ఆయన చ్చెనట్టు వింటడు". పీల్చిన బీడి దమ్మును బయటకి తిరిగి వదులుతూ అనేలోపే --

"మీదేం లెక్కంటవ్" అన్నారు అందరు ఒక్కసారె.

"అనేదెందుకు మీకే తెలుస్తుంది పిలువు పిలువు మీ మొగళ్ళను పిలువు. సర్పంచ్ రమ్మంటుండు"

"ఎందుకట దొరోరు ఈయన ద్వారా పిలిపిస్తుండేమో" తిరిగి తన కొప్పును బిగిస్తూ అన్నది.

"సెపితిగదా దొర గారు ఏదంటే అదని కారోబారు శాసన ప్రకటన చేశాడు" బీడి తాగటం వలన ఊరిన ఉమ్మిని తుపుక్కున ఉమ్మేస్తూ.

"అంటే ఒక్క దొర గారి ఓటుతోనే గెలిచిండా. మేమంతా మా ఓట్లు వేయలేదా? నువ్వు సూడలేదా? నువ్వే పిలుచుక పోయి ఓట్లేపిస్తివి గదా" అంది బుచ్చయ్య భార్య చంద్రమ్మ.

"అప్పటి సంగతి ఇప్పుడెందుకు. ఇప్పటి సంగతి సెప్పుండ్రి "అన్నాడు. ఎవరు మాట్లాడలేదు.

'పసులు మేతలేక సస్తన్నట్టుంది. ఎవడు బందెలో తోలిండో వాళ్ళే మళ్ళీ నా దొడ్లో తోలిపోవాలి అని పట్టుబట్టిండు రెడ్డాయన. ఎట్లా అబ్బా' - అనుకుంటూ పంచాయితీ ఆఫీసు వైపు నడిచాడు. బందెల దొడ్లో పశువులు అరుస్తూనే వున్నాయి.

ఆ రాత్రి అలజడిగా వుంటుందనుకున్న దళితవాడ ప్రశాంతంగా వుంది. దొరకు నిద్ర రావటం లేదు. సర్పంచ్‌ను ఇంటికి రావాల్సిందిగా కబురు పంపితే ఆయన రాలేదు. పక్కవాడలోవుంటున్న చదువు పంతులు 'ఈ రోజు ఇంట్లో వున్నాడో అనుకుంటూ కాళ్ళకు చెప్పులేసుకొని టార్చ్‌లైట్ చేతబట్టుకొని పంతులింటికి బయలుదేరాడు. సందుల్లో

కుక్కలు అరుస్తున్నాయి. ఆయన బాగా చదువుకున్న వాడు. మెల్లగా వెళ్ళి తలుపు తట్టాడు.

"ఎవరు " లోపలనుండి.

"పెదరెడ్డిని " గొంతులో చిన్నతనపు పొర ధ్వనించింది.

తలుపు తెరుస్తూ " ఏమిటి ఇంత రాత్రి వేళ వచ్చారు " పంతులు.

"కొంచెం మాట్లాడిపోదామని " నవ్వును నటిస్తూ అన్నాడు.

"అంత అర్జంటా "- రవ్వంత చికాకుగా అన్నాడు.

"అర్జంటేమీ కాదు. కానీ కంటికి కునుకు రావటం లేదు " ఈసారి మాటలు బాధాభరితంగా వున్నాయి.

"లోనికి రండి " అని తలుపులు తెరిచి లోపలికి వచ్చినాక తలుపులు దగ్గరేశాడు.

ఇద్దరూ వరండాలో వున్న కుర్చీలో కూర్చున్నారు.

"చెప్పండి " అంటూ ఆవలించాడు.

"మీ నిద్రను చెడకొట్టాను, తప్పలేదు " అంటూ చూపులను తన వళ్ళోకి మరల్చుకొని ఎడమ చేతిలో కుడుచేతిని ఉంచి తన వేళ్ళను తానే చూసుకుంటూ ఐదేళ్ళు సరిగా లేవుకదా అన్న సంగతి మరొక సారి నిర్ధారించుకొని

"ఈ వూరి మాదిగలకు నాకు పేచీ వచ్చింది " అని తల దించుకొనే అన్నాడు. గొంతులో మాట ఆగుతూ వచ్చింది.

" ఏ విషయంలో ? " అన్నట్టు చూశాడు.

"మా పశువులను బందెల దొడ్లో పెట్టారు " అప్పుడూ తల పైకెత్తలేదు.

"చేలో పడితే పెట్టారేమో " అనుకున్నాడు పంతులు.

"తరతరాల నుండి మా పశువులు ఎవరి చేలోపడ్డా ఎదురు చెప్పరు. ఈ సారి మన పంచెన బతికే ఆ దున్న గాళ్ళు మా పశువులను బందెల దొడ్డిలో పెడతారా " అని పంతులు కళ్ళలోకి చూశాడు, గొంతులో ధ్వని మారింది.

పంతులు మౌనంగా వింటూ గడియారం వైపు చూస్తూ వున్నాడు.

"ఇక నుండి వాళ్ళను మా పొలాల్లోకి రానీయం "

"మరి సాగు చేసేది ఎవరు " అన్నట్టు చూశాడు పంతులు కాస్త కదిలి కూర్చుంటూ

"ట్రాక్టర్లు, ఏతకోతకు మిషన్లు కూడా వచ్చినయికదా " ఈసారి సూటిగా పంతులు కళ్ళలోకి చూస్తూ అన్నాడు.

"వీళ్ళతో పనేముంది " అన్నాడు ఆవేశంగా.

"ఆలోచించండి " అన్నాడు పంతులు. ఎడమచేతిలో కుడిచేతిని వెలికల వుంచుతూ రేపటిగూర్చిన ఆలోచనల్లోకి వెళ్ళాడు.

"ఇక ఆలోచనే లేదు. రేపు చావడి దగ్గర చాటింపు వేయించాల్సిందే . "

"అంటే సంఘబహిష్కరణా "అంటూ ఆశ్చర్యంగా రెడ్డి ముఖంలోకి చూస్తూ అన్నాడు పంతులు.

"అంతే "అంటూ అదో మాదిరిగా లేచి నిల్చున్నాడు.

రెడ్డి ముఖంలోకి రెప్పవాల్చకుండా చూస్తూ "తొందర పడకండి " తానూ లేస్తూ అన్నాడు పంతులు.

"ఈ వూళ్ళోని వాళ్ళకు ముఖ్యంగా మాలమాదిగలకు మేమే దిక్కండి " ఆ మాటల్లో ఎంతో పెద్దరికం ధ్వనించింది.

"అది నిజం కావచ్చు కానీ రోజులు మారాయి "

రెడ్డి మాట్లాడలేదు. ముక్కుపుటాలెగురుతూ వున్నాయి. నుదుట చెమట పూసింది.

"ప్రతి పౌరునికి చట్ట రక్షణ వుంటుంది "

"ఉండనీయండి. మేమేమన్నా వాళ్ళను తిడుతున్నామా కొడుతున్నామా నా పశువులను కొట్టుక పోయినా నేను పల్లెత్తు మాట అనలేదు " తన ఎదలోని బాధను నిష్ఠూరంగా వెళ్ళగక్కాడు.

"మారుతున్న సమాజాన్ని మీరు చూస్తూనే వున్నారు కదా. ఎవరు ఎవర్ని తిట్టలేరు కొట్టలేరు " అన్నాడు పంతులు.

"తిట్టను కొట్టను చేసి చూపిస్తాను నా పశువులనే హోప్ " అంటు పటపట పళ్ళు కొరుకుతూ బయటకు నడిచాడు.

* * *

ఊళ్ళోని అగ్ర కులాల్ల వాళ్ళందరూ ఒక్కటైనారు. వాళ్ళకు భూమి అండగా, డబ్బు రక్షణగా ఎలాగో వుంది.

"తిండిగూడలేని సన్నాసి నాకొడుకులు మనల్నెదిరించటం సహించరానిది" దొర అన్నాడు మీసాల మీద చెయ్యేస్తూ. అప్పుడే సరిగ్గా ఓ గాడిద చావటి పక్కమ్మటె ఓండ్ర పెడుతూ పరుగెత్తుతూ వుంది. దానివెనకాల ఓ కుక్క నోరు తెరిచి వగిరిస్తూ తరుముతుంది.

"అవును "అక్కసుగా చంద్రరావు. ఊరంతా ఏదో సమస్యతో అట్టుడికి పోవాలని

ఆలోచిస్తూ వుంటాడు.

"అంతే "అన్నట్టు మిగతా వాళ్ళు తలాడించారు.

సర్పంచ్ దళితవాడలో తిరుగుతూ మనిషి మనిషిని కలసి "జరిగిందేదో జరిగింది. దొరను బతిమాలుకుంటేపాయె. విషయం ముదరకముందే పరిష్కారం జిరగితే అందరికీ మంచిది " అంటున్నాడు.

"మేమేమి సేసినం. పసులు చేలో పడితే బందెల దొడ్డిలో పెట్టటం తప్పా " అని పుట్ట నాగయ్య అన్నాడు?

"చిన్న పెద్ద లేకుంటనా ? " సర్పంచ్ సాధువులాగా అన్నాడు. అప్పుడు ఓ కుక్క సర్పంచ్ చుట్టూ తిరుగుతూ గునుస్తూంది.

"ఈ కుక్క " - అంటూ కొంచెం భయంగా పక్కకు జరిగాడు. సర్పంచ్.

"అది ఏమీ అనదు. ఇంతకు ముందు ఎలచ్చన్ల వస్తిరి కదా. అపుడొచ్చింది మీరేనా కాదా ? అని మూర్క చూస్తుంది అంతే " అన్నాడు నాగయ్య.

"కుక్క వాసన ద్వారా కొత్తమనిషి అయింది, పాతమనిషి అయింది గుర్తించి పాతమనిషి అయితే ఏమీ అనదు "

"సరే మీ ఇష్టం నేను చెప్పేది చెప్పిన " అన్నాడు సర్పంచ్.

"ఆయన ఒక్కోటుతో నీవు గెలవలెదు. మేమందరము ఓటేసినం. నీవు ఎక్కువమందికేయి వుంటవో ఆ ఒక్కోటుకేయి వుంటవో తేల్చుకో " అని నాగయ్య తనవాళ్ళవైపు చూశాడు. అక్కడ వున్న ఆడమొగా అందరూ అంతే గదా అన్నట్టు చూశారు. సర్పంచ్ నోట మాట రాలేదు. అక్కడనుండి కదిలాడు. ఊరు రెండు భాగాలుగా చీలిపోయింది. అగ్రకులాల వాడ అధమ కులాల వాడగా అంతకు ముందే వున్న హద్దు మరింత గట్టిపడి ఆ వాడలోని కుక్క ఈవాడలోనికి, ఈ వాడలోని కుక్క ఆవాడలోనికి పోకుండా కనిపెడుతున్నారు ఇరుపక్షాలవాళ్ళు.

దళితవాడలో పొగ రాజేది లేనిది కనిపెడుతూనే వున్నారు. తమ వాడలో ఏం జరుగుతున్నది పొక్కనిస్తలేరు. కోమట్లను ఉప్పు, పప్పు ఇవ్వద్దన్నారు. గీత పనివాళ్ళు తమ కల్లును ఊళ్ళోకి తేవద్దన్నారు. చేసేది లేక దళితులు ఆకలి దప్పులు తట్టుకోలేక చుట్టుపక్కల ఊళ్ళకి వెళ్ళి ఒకటి రెండు రోజులు ఉండి వస్తున్నారు. అప్పుడప్పుడు ఆకలికి తట్టుకోలెని పిల్లలకు బొత్తలను నరికి వాటి గుజ్జును తినిపిస్తున్నారు. వ్యవసాయ పనులకు పిలిచేవారు లేరు. వాళ్ళంతటవాళ్ళూ వెళ్ళటం లేదు. పశువులు మేపేవాళ్ళు, పొలం దున్నేవాళ్ళు, ఎరువులు చల్లే వాళ్ళు ఎవర్ని పనులకు పిలవటం లేదు. ఇండ్లలో పొగ

రాజటం లేదు. పస్తులుంటున్నారు. అప్పుడపుడు గుట్టకు వెళ్ళి సీతాఫల కాయలు తీసికొని వచ్చి కాల్చుకు తింటున్నారు. పండ్లు దొరికితే పిల్లలకు ఇస్తున్నారు. పక్క ఊర్ల వాళ్ళు పట్టించుకొని ఇరువర్గాలకు నచ్చచెప్పినా ఫలితం కనిపించలేదు. రెండు వారాలు గడిచాయి. దొర వంశంలో ఓ చావు జరిగింది. అన్ని పనులు వాళ్లే చేసుకున్నారు. కనీసం డప్పులు కొట్టడానికైనా పిలవలేదు. ఓ పెండ్లి జరిగింది. దానికి పిలవలేదు. దళితుల మేకలు పనాది గుండా మాత్రమే వెళ్ళాలి. ఎవరి పట్టా భూమిలోనుండి వెళ్ళకూడదు. బీడు-బోడు భూముల్లో మాత్రమే తిరగాలి. మంగలి క్షౌరం చేయకుండా, చాకలి బట్టలు ఉతకకుండా చేశారు. అట్లా ఇరవై రోజులు గడిచాయి. భూమి లేని వాళ్ళకు భుక్తి ఉండదు. కూలి దొరక్కపోతే కూడు వుండదు. ఆ రహస్యం తెల్సి వాళ్ళు సాగించుకుంటుంటే సామాన్యులు సతమతమైపోతున్నారు.

దొర దర్బారులో రోజూ చర్చలు జరుగుతున్నాయి. దళితులను ఎట్లా ఇరకాటంలో పెట్టాలి , ఇంకా ఎట్లా వాళ్ళని అణిచి వుంచాలి అనేదే ఆ చర్చల్లోని అంశం.

ఓ సారి దళిత స్త్రీని చెలుకలో బలాత్కారం చేసినపుడు అందరూ ఒక్కటై నిలదీసింది గుర్తుచేసికొని కక్షను మరింత కట్టుదిట్టం చేస్తున్నారు. ద్వేషం ఎప్పుడూ చెడునే కోరుకుంటుంది. బహుజనులంతా ఒక్కటే అని ఎన్నికల ముందు కల్సి తిరిగినా పోటీ చేసిన వారికి డిపాజిట్ కూడా రాకపోయే సరికి మళ్ళీ ఎవరికి వారే యమునా తీరే అయ్యారు. గతంలో లాగ అగ్రకులాల తొత్తులై దళితులను పీడిస్తూనే వున్నారు.

“మీరు నా మాట వినడం లేదు. అని అనేలోపే వాళ్ళు మాత్రం తమ మాట ఇంటరా ” అన్నారు.

“మాది ఏం తప్పు లేదు. చేలో పడ్డ పసులను ఎవరైనా బందెలదొడ్లో పెడతారు. మేము ఆ పనే చేసినం. ఎన్నిసార్లు మా మేకలను చెలుకల్లో ఆకు అలం మేసినందుకే బందెల దొడ్లో పెట్టలేదు? దండగలను కట్టి విడిపించుకోలేదు ” అన్నాడు లింగయ్య.

సర్పంచ్ మాట్లాడలేదు. ఎదుటి వ్యక్తి ఓ వాస్తవాన్ని గుర్తుచేసినపుడు ఎవరికైనా మాటలు పెకల్వవు.

“రేపు నేను పక్కూరిలో జరిగే అంగడిలో బర్రెను కొనడానికి వస్తున్న. ముఖ్యులు అక్కడికి రండి. అక్కడ మాట్లాడుకుందాం ” అన్నాడు సర్పంచ్.

“అవునులే ప్రజల ఓట్లతో ఎన్నికైన పెద్దమనిషి తన వూరి విషయం పొరుగూరిలో మాట్లాడుకోవాలె. ఇది సర్పంచ్ సంగతి ” - అన్నాడు బుచ్చయ్య.

అనుకున్నట్టై దళిత పెద్దలు అంగట్లో ఓ పక్క చెట్టుకింద నిలుచుని బొంగులు, పుట్నాలు తింటున్నారు. పది గంటలయ్యేసరికి సర్పంచ్ వారిని కలుసుకున్నాడు.

"ఆ చెప్పండి " అన్నాడు.

"తమరే చెప్పాలి " అన్నాడు.

" ఏం చెప్పను. వాళ్ళు రోజురోజుకు రెచ్చిపోతున్నారు. మీరు తీసుకున్న అప్పులన్నీ లెక్కరాసి, పైసా లేకుండా వసూలు చేయాలని చూస్తున్నారు. రేపో మాపో మిమ్ములను నిలదీయవచ్చు. మీరు పెండ్లి పేరంటాలకు ఎన్ని తీసుకున్నరో కానీ అవన్నీ అసలు మిత్తి వేలకు వేలయి కూర్చున్నయి. మీరు ఇవ్వకుంటే మీరు రాసిచ్చిన కాగితాలను బట్టై కోర్టుల చుట్టూ తిప్పుతారు. కడుపుల పేగులు లేనివాళ్ళు మీరు ఎట్లా తట్టుకుంటరు "

"అంత పని చేస్తరు అనుకున్నం "అన్నారు.

"ఈ పరిస్థితిలో ఏం చేయాలో మాకు తోస్తలేదు. మీరే చెప్పాలి. అయినా మీరు గ్రామ సభ పెట్టి న్యాయ అన్యాయాలను విచారించి తీర్పు చెప్పొచ్చు గదా " అన్నాడు బుచ్చయ్య.

"చెప్పొచ్చు అనుకో " - అని ఆగాడు.

"ఏమి చెప్పినా వినేట్టు లేరు. రోజురోజుకు బిగిసిపోతుంది వ్యవహారం . వినకుంటే ఏం చేస్తాం. చెలుకను అమ్మి అప్పు తీర్చేస్తాం " అన్నారు అందరూ ఒక్కసారె.

కూలి చేసుకుంటే ఏ బాధా లేదు భూమితోనే కదా తగాదా అందరు మౌనంగా ఆలోచిస్తు నిలుచున్నారు.

"ఆ భూమిని కూడా ఎవరూ కొనకుండా చేస్తే "నుదుటి చెమటను తుడుచుకుంటూ అన్నాడు.

"ఆ భూమిని కూడా అప్పుల కింద ఆయనే వుంచుకోనీ " - అన్నాడు బచ్చయ్య.

"ఆ భూమి లేనప్పుడు కూలో నాలో చేసుకుని బతకలేదా. ఇప్పుడు అంతే " అన్నాడు లింగయ్య.

అప్పుడు అందరి కళ్ళలో నీరు ఊరింది.

"ఈ ఏతకోత మిషన్ వచ్చి మనిషిసంబంధాలను మార్చేస్తున్నాయి "అన్నాడు సర్పంచ్.

పక్కనే పశువుల అమ్మకం, కొనడం జరుగుతుంది.

ఒక వూరి పశువును మరో వూరి రైతు కొనుక్కుని కొట్టుకపోతున్నాడు. అమ్మిన రైతునే చూస్తూ 'అంబా ' అంటూ అరుస్తూ కొత్త యజమాని వద్దకు పోకుండా ఊడిగల పడుతూ వుంది కోడె.

"చూడండి మీ మనసుల్లో వున్నది నాకు తెలుసు"

" కనీసం అదన్నా గ్రహించావు " అంటూ అక్కడి నుండి కదిలారు.

* * *

దళితవాడంతా తాటికమ్మల గుడిసెలు. ప్రభుత్వపు పక్కా ఇండ్ల పథకాన్ని ఆ ఊరు చేరనివ్వలేదు. వేపచెట్ల కింద ఆడా- మొగా బతుకుదెరువు చర్చలు. వాళ్ళ శ్వాసల్లో ఆకలి వాసనలు. గుండెల్లో ఏదో మొండి ధైర్యాన్ని నింపుకుంటున్నారు.

" పంట పొలాలు లేవు, పట్టా బూములు లేవు " అంది రంగమ్మ.

" రెక్కాడితే డొక్కాడే " అంది ఎంకమ్మ.

" ఊరొదిలి పోవాలంటే మనసొప్పటం లేదు " - అన్నాడు లింగయ్య.

" ఉన్న చోటే ఊరు " - అన్నాడు బుచ్చయ్య.

అక్కడ చావడి దర్బారులో కఠినమైన నిర్ణయాలు జరుగుతూనే వున్నాయి. చేతగాని సర్పంచ్ చూస్తూ నిలుచున్నాడు.

* * *

తెల్లవారుజామున ఆడమొగా పొలిమేర దాటుతునే వున్నారు. పోతూ పోతూ కంది చేనువైపు చూస్తూ కన్నీరు పెట్టుకున్నారు. పుట్టిపెరిగిన ఊరివైపు మళ్ళి మళ్ళి చూస్తున్నారు. వాళ్ళతో పాటు వాళ్ళ కుక్కలు వెనక నడుస్తూ అప్పుడప్పుడు ఆగి ఊరివైపు చూస్తూ కుయ్ కుయ్ మంటున్నాయి. తలల మీది మూటల మీద కూర్చున్న కోడిపిల్లలు బెదిరి బెదిరి చూస్తున్నాయి.

" ఆగండి " అన్నాను

ఆగలేదు. నడుస్తూనే వున్నారు.

" పారిపోతున్నారా " అడిగాను.

" లేదు. వలస పోతున్నాం " అన్నట్టు వినిపించింది.

" ఎక్కడికి " అన్నాను .

" కూలి దొరికే చోటుకు. అక్కడ మాత్రం ఈ దొరలు లేని చోటుకే పోతాము "

నవంబర్ `97 ●